రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

### -పట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం, నవంబర్22 ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకే ఎమ్మెల్యేగా బరిలో నిలిచానని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని, ఇబ్రహీంపట్నం గడ్డప కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డిరంగారెడ్డి పిలుపునిచ్చారు. బుధవా రం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ, పోచారం, మేటీల్ల, ఖానాపూర్ గ్రామాలలో పట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వ విధానాలతో నిరంకుశ పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని మండిపడ్డారు. కల్వకుర్తి ప్రస్తుత ఎమ్మెల్యే మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నియోజకవర్గాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని, మాటలు తప్ప చేసిందేమి లేదని, దీంతో నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందని ఆరోపించారు. నియోజకవర్గంలో సాగునీటి సమస్యను కూడా తీర్చలేదని, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడంలో, విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో మిగిలి ఉన్న కాల్వ నిర్మాణ పనులు కూడా పూర్తి చేయ లేదని విమర్శించారు. త్వరలో నిర్వహించే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవకుడిగా పనిచేస్తానని తెలిపారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని, ఆరు గ్యారెంటీ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని, తెలంగాణలో ప్రజాస్వామ్య పాలనను తీసుకొచ్చేందుకు, తెలంగాణ అభివృద్ధి కోసం ప్రజలు, నాయకులు ఐక్యతగా పనిచేసి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.

# నువ్వు వస్తే నేను పోతా

### -కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలలో నాయకుల తీరు

### -ఆధిపత్య పోరు సమన్వయ లోపం ఎమ్మెల్యే అభ్యర్థులకు తలనొప్పిగా మారిన వైనం

**యాచారం నవంబరు22,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల జోరు కొనసాగుతున్న తరుణంలో కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలో నాయకుల మధ్య ఆధిపత్య పోరు జోరుగా సాగుతోంది. ఒకే గ్రామంలో సర్పంచ్,ఎంపిటిసిలు ఒకే పార్టీలో ఉండడంతో ఆధిపత్య పోరుతో ఎమ్మెల్యే అభ్యర్థులు క్యాడర్ ఇబ్బందులకు గురి అవుతున్నారు.ఒకరు గెలిచి సర్పంచ్ ఎన్నిక కాగా ఓడిన వ్యక్తి ఎంపిటిసిగా ప్రజలలో జాలితో గెలవడం జరిగింది.ఇరువురు అధికార పార్టీలో ఉండడం వారి మధ్య సయోధ్య కుదరకపోవడం సమన్వయం లోపించడంతో అక్కడక్కడ విభేదాలు వస్తున్నాయి.ఈ ఆధిపత్య పోరుతో ఎమ్మెల్యే అభ్యర్థులకు తలనొప్పిగా మారింది.బీఆర్ఎస్ అధికార పార్టీ కావడంతో క్రమశిక్షణతో కూడుకున్న సమస్య కొంచెం తక్కువగా ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఎక్కువగా ఉందని భావిస్తున్నారు.ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు హడావిడిగా ఉంటే నాయకులు కొంతమంది ఆధిపత్య పోరుతో ఎమ్మెల్యే అభ్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారు.అందుకు కొంతమంది నిస్వార్థంతో అంకితభావంతో పనిచేస్తున్న మరికొందరు సినియర్లు తగిన ప్రాధాన్యత దక్కపోవడంతో సీనియర్ల సైతం అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తుంది. అక్కడక్కడ మేం దగ్గర పడతా ఉంటే అభ్యర్థులలో టెన్షన్ మొదలైంది.సామ,వేద దండోపాయాలన్నట్టు అన్ని విధాలుగా ఓటర్లు ఆకర్షించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నారు.

# అయ్యప్ప శరణుగోషతో మారుమ్రోగుతున్న దేవాలయం

### -మాల ధరించిన అయ్యప్ప స్వాములకు నిత్యాఅన్నదానం

**నందిగామ నవంబరు22,ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయం నిత్యం అయ్యప్ప స్వాముల శరణు గోషతో మారుమ్రోగుతుంది.గురుస్వామి గిరీష్ నాయర్ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు.స్వామి దింతన తోం...అయ్యప్ప దింతన తోం అంటూ అయ్యప్ప భక్తుల శరణు గోషతో ఆలయ పరిసర ప్రాంతం మారుమ్రోగింది.అయ్యప్ప మాల ధరించిన స్వాముల పవిత్ర రోజులను పురస్కరించుకొని ఆలయ కమిటీ నిర్వాహకులు స్వాములకు నిత్యాన్నదానం చేస్తున్నారు. అన్నదాన ప్రభువులను ఆలయ కమిటీ శాలువాతో సన్మానించే ఆనాయితి గత కొన్నెళ్లుగా కొనసాగిస్తూ దైవకార్యాన్ని కొనసాగిస్తున్నారు.



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

- 50 ఏండ్ల పాలనతో తెలంగాణకు అన్యాయం
- ధరణీ ఎత్తెస్తే మళ్లీ దళారులదే రాజ్యం
- తాండూరులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని గెలిపించాలి
- సంక్షేమ పథకాలను ఆగకుండా అమలు చేస్తాం
- తాండూరు ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కెసిఆర్

# కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు

**పెద్దేముల్, తాండూరు టౌన్, నవంబరు 22, ప్రభాతవార్త:** 50 ఏండ్ల పాలనలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని, అందుకు తెలంగాణలో కాంగ్రెస్ వచ్చేది లేదు సచ్చేది లేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆరోపించారు. బుధవారం తాండూరు పట్టణంలోని విలియం మూన్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం కేసీఆర్ మాట్లాడుతూ 10 ఏళ్ళ కాలంలో అన్ని రంగాలలో తెలంగాణను అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రబాగంలో నిలిపామని అన్నారు.అభ్యర్థుల నిలబడిన పార్టీల చరిత్ర వైఖరీని పరిశీలించి ఏది న్యాయమో ఆలోచించి ఓటు అనే వజ్రాయుధాన్ని ఉపయోగించి బిఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటకలో పట్టిన గతే పడుతుందని అన్నారు. ధరణి ఎత్తెస్తే మళ్ళి దళారుల రాజ్యమని రావడం ఖాయమని అన్నారు. ధరణి తీసేసి భూమాత పేరు పెడతారని,అది భూమాతా కాదు భూమేత అని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటువేసి పథకాలు బిఆర్ఎస్ ఇయ్యాలంటే కత్తి ఒకరికి ఇచ్చి ఇంకోకరిని యుద్ధము చేయమన్నట్లు ఉందని అన్నారు. అందుకు యువకుడు, నిజాయితి పరుడు రోహిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని అన్నారు. గిరిజన తాండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత బిఆర్ఎస్‌దేనని అన్నారు. ఎమ్మెల్యేగా పైలెట్ రోహిత్‌రెడ్డిని గెలిపిస్తే రైతుబందు,24 గంటల నాణ్యమైన కరెంటు, రైతు భీమా వస్తదని అన్నారు. జిన్‌గుర్తిలో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేస్తామని అన్నారు. తాండూరు వెనుకబడిన ప్రాంతం అని, రోహిత్‌రెడ్డి అడిగిన కోర్కెలను తీర్చుతామని అన్నారు. రైతు బాగుంటేనే దేశము అభివృద్ధి చెందుతుందని,అందుకు రైతుసంక్షేమం కోసం రైతుబందు, రైతు భీమా, ఉచిత కరెంటు తదితర పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ హయంలో తాగు, సాగు నీరు, కరెంటు ఎన్నో ఇబ్బందులు ఉండేవి, ప్రస్తుతం 24 గంటల నాణ్యమైన కరెంటు, మిషన్ భగిరథ ద్వారా స్వచ్ఛమైన తాగు నీరు. ప్రాజెక్టుల, మిషన్ కాకతీయ ద్వారా పుష్కలమైన నీటితో పంటలు కళకళలాడుతున్నాయని అన్నారు. ధాన్యం దిగుబడిలో తెలంగాణ పంజాబ్ రాష్ట్రాన్ని అధిగమించిందని అన్నారు. బిజేపి కుట్రలను తిప్పికొట్టిన పైలెట్ రోహిత్‌రెడ్డిని గెలిపించే భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు. సంక్షేమ పథకాలను ఆగకుండా అమలు చేస్తామని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో తాండూరు ప్రాంతానికి వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేసామని అన్నారు. జుంటుపల్లి, కోటపల్లి ప్రాజెక్టు ఆధునికరణకు నిధులు మంజూరు చేయాలని అన్నారు. గత ఐదేళ్ళలో తాండూరు ప్రాంతం అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. స్థానికుడైన తనకు కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గనుల,భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, యంపి రంజిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కేశవరావు, మధుసూధనచారీ, కరణం పురుషోత్తంరావు, శ్రీశైల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రాజుగౌడ్, మునిసిపల్ వైస్ చైర్మెన్ దీపా నర్సిములు నాయకులు,కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన జన సందోహం

# నరకానికి నకళ్లు...ఈ రహదారులు

### -పట్టించుకోని పాలకులు,అధికారులు
### -నిత్యం దుమ్ముతో సతమతమవుతున్న జనం
### -పాలకుల తీరుపై మండిపడుతున్న ప్రజలు

**నందిగామ నవంబరు22,ప్రభాతవార్త :** పెరుగొప్ప..ఊరుదిబ్బలా మారింది.నందిగామ మండల పరిస్థితి పాలకుల నిర్లక్ష్యం ..అధికారుల అలసత్వంతో ప్రధాన రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి.నందిగామ మండలం పరిధిలోని అప్పరెడ్డిగూ నుండి వీర్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై కంకర తెలి.దుమ్ము లేస్తున్న పట్టించుకునే దిక్కే కరువైంది.ఈ రోడ్డుపై పరిమితికి మించిన లోడుతో స్పాంజ్ ఐరన్ ముడి సరుకు,ఉత్పత్తుల ట్రాన్స్‌పోర్ట్ లారీలతో రోడ్లు పగిలి,కంకర తెలి, వాహనదారులకు,బాటసారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అటు పాలకులు ఇటు అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.



అప్పరెడ్డిగూడ మీదుగా వీర్లపల్లి వెళ్లే రోడ్డు దుస్థితి

**గత రెండు,మూడేళ్లుగా ఇవే బాధలు :**

మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న అప్పరెడ్డిగూడ మీదుగా వీర్లపల్లి వెళ్లే ఈ రహదారిపై ద్విచక్ర వాహనదారులు ప్రయాణించాలననన ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని వెళ్తారు.రహదారి ధ్వంసమై ,గోతులమయమైన సమస్యను అనేక మార్లు మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు,ప్రజాప్రతినిధులు సభ కొచ్చిన ముఖ్యనేతలకు నెత్తి,నోరు మొత్తుకున్న,గోడు వినిపించుకున్న ఫలితం కానరాలేదని ఈ ప్రాంతం ప్రజలు పాలకుల పనితీరుపై శాపనార్తాలు పెడుతూ దుమ్మెత్తి పోస్తున్నారు.



ప్రమాదకరంగా మారిన రహదారి మలుపు

**బస్సు సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు**

రహదారి గొతులమయమై దుమ్మురెగుతున్న దుస్థితిని చూసి ఆర్టీసీ ఉన్నతాధికారులు మామిడిపల్లికి వచ్చే ఆర్టిసి బస్సును నిలుపుదల చేశారు.బస్ రాకపోవడంతో విద్యార్థులు,రైతులు,కార్మికులు చూట్టుర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఒక్కోసారి ప్రైవేట్ వాహనాలను అశ్రయిస్తే ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు లేకపోలేదు.ఇప్పటికైన అధికారులు మొల్కొని రహదారికి మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# జిల్లాలో పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

### -వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 22, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ఎన్నికలు నిర్వాహణ పారదర్శకంగ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఆయన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. బుధవారం ఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితీష్‌వ్యాస్ ఎన్నికల సందర్భంగ ఏర్పాట్లపై కలెక్టర్లతో తెలంగాణలో ఎన్నికల నిర్వాహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వాహణకు ఎలాంటి అనుమానాలకు తావులేకుండ ఎన్నికల ప్రక్రియను పూర్తిగ పారదర్శకంగ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వాహణ, ఓటరు గుర్తింపుకార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఈవిఎంల యంత్రాల కమిషనింగ్, ఇంటి నుంచి ఓటు సేకరణ, పోలింగ్ సిబ్బంది శిక్షణ, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, పలు అంశాలపై సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితీష్‌వ్యాస్ జిల్లా కలెక్టర్‌కు సూచించారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొంటూ జిల్లా వ్యాప్తంగ ఎన్నికలు ప్రశాంతంగ నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కొత్త ఓటర్లకు గుర్తింపుకార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగ ఓటరు స్లిప్పుల పంపిణీ సగటున 80శాతం పూర్తి చేశామని అన్నారు. ఓటరు ఫోటో గుర్తింపు కార్డులు ఎపిక్‌లను పోస్టల్‌శాఖ ద్వారా నేరుగా ఓటర్లకు అందించే విధంగ చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పోలింగ్ నిర్వాహణ కోసం ఈవిఎం బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, టెండర్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తి జరిగిందన్నారు. కమిషనింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు వీలుగా ఈసిఐఎల్ ఇంజనీర్ల బృందాలు జిల్లాకు చేరుకున్నారని అన్నారు. 80ఏళ్ల పైబడిన వృద్ధులు, 40శాతంకు పైగా ఉన్న అంగవైకల్యం కల్గిన దివ్యాంగులు కలుపుకుని 1070 మంది ఓటు ఫ్రమ్ హోమ్ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు అర్హులుగా గుర్తించామన్నారు. వారి ఇళ్లవద్దకే వెళ్లి ఓటును స్వీకరించేందుకు వీలుగ ప్రత్యేక పోలింగ్ బృందాలు ఏర్పాటు చేశామని, వాటి నిర్వాహణకు ప్రణాళికలు రూపొందించామని అన్నారు. ఈసి నిబంధనలకు అనుగుణంగ పూర్తిగ గోప్యత పాటిస్తూ ఓటు సేకరణ జరిపేలా గట్టి చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఇప్పటికే రెండు సార్లు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి పోలింగ్ నిర్వాహణపై పూర్తి అవగాహన కల్పించామని అన్నారు. శిక్షణ కేంద్రాల వద్దే ఫెసిలిటేషన్ సెంటర్లను నెలకొల్పి పోలింగ్ విధుల్లో నియమించబడిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. పోలీసులు సహా మిగతా ఇతర ఎన్నికల విధుల్లో నియమించబడిన సిబ్బంది కోసం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ గౌతమ్ వివరించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలను ఈసి దృష్టికి సి.విజిల్ యాప్ గురించి విస్తృతంగ ప్రచారం చేసినట్లు, ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగ ప్రజలకు అవగాహణ కల్పించామని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలోనూ కంట్రోల్ ఏర్పాటు చేసి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తున్నామని అన్నారు. ఎన్నికల ప్రచార సభలు,సమావేశాలు వాటి కోసం ధరఖాస్తులు చేసుకోవటానికి సువిధ పోర్టల్ ద్వారా పరిశీలించి అనుమతులు గడువులోపే ఇస్తున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు కృష్ణారెడ్డి, దేవసహాయం, విజయకుమారి, ఖాసిం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్, డిఆర్ఓ, అధికారులు

# విద్యార్థులకు తీరని కోరికగా మిగిలిన డిగ్రీ కళాశాల ఏర్పాటు

### -కళాశాల ఏర్పాటు చేయాలని 20 ఏండ్ల నుంచి ఉద్యమాలు
### -పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం పట్టించుకున్న నేతల కరువు
### -ఎన్నికల సమయాల్లో హామీలు ఇచ్చి మరిచిన నాయకులు

**మేడ్చల్, నవంబర్ 22. ప్రభాతవార్త :** పేద విద్యార్థుల ఉన్నత చదువుల కొరకు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని నేతలు ఇచ్చిన హామి నేరవేరకపోవడంతో మేడ్చల్ విద్యార్థుల కళాశాల స్వప్నం తీరని కోరికగా మారింది. దేశం లోనె ప్రత్యేక గుర్తింపు ఉన్న మేడ్చల్ పట్టణం దినదినాభివృద్ధి చెంది నివాసానికి పుట్టినిల్లుగా మారింది. మేడ్చల్ మండల సమీప ప్రజలే కాకుండా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని వివిద గ్రామాల ప్రజలు మేడ్చల్‌కు రాకపోకలు సాగిస్తారు. వీరితో పాటు విద్యార్థులు ఇతర జిల్లాల పరిధి, సుదూర ప్రాంతాల నుండి పేద విద్యార్థులు వచ్చి ఇక్కడ పదో తరగతి, ఇంటర్ మీడియట్ విద్యను అభ్యసిస్తున్నారు. డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద కుటుంబాల చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోలేకపోతున్నారు. కొంతమంది నగరానికి వెళుతున్నా, ఎక్కువ శాతం మంది విద్యార్థులు ముఖ్యంగా విద్యార్థినీలు డిగ్రీ చదువుకోలేకపోతున్నారు. ఆర్థిక స్థోమత లేక, నగరానికి వెళ్లలేక, తల్లిదండ్రులు పంపించలేక ఎంతో మంది విద్యార్థులు డిగ్రీ కళాశాల లేని కారణంగా ఆర్థాంతరంగా చదువు ఆపేసి కంపనీలలోకి పనులకు వెళుతున్నారు. చదువుకోవాలని కోరిక ఉన్నా కళాశాల లేకపోవడంతో తాము ఉన్నత చదువును నోచుకోవడం లేదని ఎంతో మంది విద్యార్థులు తమ గోడును వినిపించిన దాఖలాలు అనేకం ఉన్నాయి. ఈ విషయం ఇలా ఉండగా మేడ్చల్ ప్రాంత, పరిసర గ్రామాలు, మండలాల పేద విద్యార్థులకు అనువుగా ఉన్న మేడ్చల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఇరవై సంవత్సరాల ముందు నుంచే విద్యార్థి సంఘాలు ఉద్యమాలు, ధర్నాలు చేశాయి. ఎమ్మెల్యేలకు, మంత్రులకు సైతం సంఘాల నాయకులు, విద్యార్థులు వినతి పత్రాలు అందజేసి విజ్ఞప్తి చేశారు. అందరి కోరిక మేరకు అప్పటి ఎమ్మెల్యేలు కేఎల్ ఆర్, సుధీర్‌రెడ్డిలు, ప్రస్తుతం మేడ్చల్ ఎమ్మెల్యే, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయాల్లో హామీలు ఇచ్చారు. కాని కళాశాలను మాత్రం ఇప్పటి ఏర్పాటు చేయలేకపోయారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలని మేడ్చల్‌లో విద్యార్థి సంఘాల నాయకులు ఉద్యమాలు చేపట్టి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి, ఎమ్మెల్యేలను, మంత్రులను అడ్డుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కాని ఇక్కడి నేతలకు గాని, ప్రజా ప్రతినిదులకు గాని, చివరకు నాటి, నేటి ప్రభుత్వాలు కళాశాల ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గతంలో జరిగిని అసెంబ్లీ ఎన్నికల సమయాల్లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని నేతలు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానె మిగిలిపోయాలని విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత విద్యను చదువుకోలేకపోతున్న తమ గోడును ఎవరు పట్టించుకోవడం లేదని విద్యార్థులు కుమిలిపోతున్నారు. డిగ్రీ కళాశాల వచ్చి తమ ఉన్నత చదువుల కోరిక తీరుతుందని పెట్టుకున్న ఆశ ఆడియాశలుగానె మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైన విద్యార్థుల భవిష్యత్ కోసం డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.





డిగ్రీ కళాశాల ఏర్పాట చేయాలని ధర్నాలు,ర్యాలీలు నిర్వహిస్తున్న ఫైల్ ఫోటో

# నేడు వికారాబాద్‌లో జరిగే సిఎం కెసిఆర్ సభకు భారీగా తరలిరావాలి

### -ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

**వికారాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో గురువారం సీఎం కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు, ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. కేసీఆర్ సభను పురస్కరించుకుని స్థానిక బ్లాక్ గ్రౌండ్‌లో సభా ఏర్పాట్లను పరిశీలించి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు ఓట్లు అడిగే హక్కు లేదని, బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆయన అన్నారు. గత ఎన్నికల మాదరిగానే ఈ సారి సైతం బ్యాలెట్ బాక్స్‌పై కారు గుర్తు మొదటి నెంబరు రావడం అదృష్టంగా భావిస్తున్నామని, ప్రచారం నిర్వహించే బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు అర్థమయ్యే రీతిలో మొదటి నెంబరు బటన్ నొక్కాలని చెబితే చాలని అయన అన్నారు. అభ్యర్థుల ఫోటోలు సైతం బ్యాలెట్ యంత్రంపై ఉంటుందని తెలిపారు. గురువారం జరుగబోయే సీఎం సభకు ప్రతి ఒక్కరు మధ్యాహ్నం 1 గంటలలోపు సభా ప్రాంగణానికి చేరుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం స్వాధీనం

**మేడ్చల్, నవంబర్ 22. ప్రభాతవార్త :** మేడ్చల్‌లో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని గిర్మాపూర్ గ్రామంలో బుధవారం మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వయించారు. ఈ దాడుల్లో గ్రామంలోని బండి మల్లేష్ గౌడ్, బండి ప్రమీల వద్ద 122 బాటిళ్ల అక్రమ మద్యాన్ని స్వాదీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు రాఘవ, యూసుఫ్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గేటెడ్ కమ్యూనిటి నిర్వహకులతో సమావేశం ఏర్పాటు చేసి, గేటెడ్ కమ్యూనిటీలో ఎలాంటి అనుమతులు లేకుండా లిక్కర్ పార్టీలు ఏర్పాటు చేయరాదని, ఒకవేళ ఎవరైనా ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదే విదంగా గేటెడ్ కమ్యూనిటిల క్లబ్ హౌజ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, క్లబ్ హౌజ్‌ల్లో ఎలాంటి పార్టీలు జరిగినా తీవ్ర పరినామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అదే విదంగా ఎవరి వద్దనైనా అక్రమ మద్యం నిల్వ ఉన్నా, అమ్మినా చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.



అక్రమ నిల్వ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

# మాదిగలమంతా మూకుమ్మడిగా బిజెపికి ఓట్లు వేస్తాం : ఎమ్మార్పీఎస్

## రాజేంద్రనగర్‌లో శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం



మైలార్‌దేవుపల్లిలో ఎమ్మార్పీఎస్, బిజెపి సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

నార్సింగి, నవంబర్ 22 ప్రభాతవార్త : ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలోని మాదిగలమంతా మూకుమ్మడిగా బిజెపికే ఓట్లు వేస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి వనం నర్సిహ్మా పేర్కొన్నారు. బుధవారం మైలార్‌దేవుపల్లిలోని బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ఇంటికెళ్లి ఎమ్మార్పీఎస్ తరపున సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు వనం నర్సిహ్మా, మద్దిలేటిలు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా మాదిగల రిజర్వేషన్లు చేయాలని ఉద్యమాలు చేసినా, ఆందోళనలు, ధర్నాలు చేసినా టిడిపి, కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు పట్టించుకోలేదని, నమ్మించి మోసం చేశారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అప్పటి ప్రధాని వాజ్‌పాయి మాదిగల రిజర్వేషన్లకు ఆర్డినెన్స్ తీసుకు వచ్చారని, ఇప్పుడు ప్రధాని నరేంద్రమోడీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టేందుకు కసరత్తు చేస్తున్నారన్నారు. మొదటి నుంచి బిజెపియే వర్గీకరణకు అనుకూలంగా ఉందని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలుపు కోసం మాదిగల మంతా మా బిడ్డల భవిష్య త్తును దృష్టిలో ఉంచుకొని బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతామని స్పష్టం చేశారు. చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్ అంతా మమ్ములను మోసం చేసిన వారేనని తెలిపారు. అనంతరం తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడు తూ మాదిగల రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్‌లో పెట్టేందుకు ప్రధాని మోడీ కసరత్తు ప్రారంభించారని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నేత మోడీ అని పేర్కొన్నారు. మాదిగల విశ్వరూప మహాసభ తరువాత మాదిగలంతా బిజెపికి అండగా ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు అంజన్ కుమార్‌గౌడ్, శ్రీధర్, మహ లింగంగౌడ్, టి.శ్రీశైలంరెడ్డి, డి.లక్ష్మీనారాయణ, ఇందిరా, ఎమ్మార్పీఎస్ నేతలు సురేష్, శంకర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

**శంషాబాద్‌లో భారీ రోడ్‌షో :** శంషాబాద్ మండలంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డికి నిర్వహించిన భారీ రోడ్‌షోకు జనం బ్రహ్మరథం పట్టారు. మహిళలు మంగళహారతులిచ్చి ఆహ్వానం పలికారు. రోడ్‌షో తరువాత శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 15.సంవత్సరాలలో అసెంబ్లీలో కనీసం 15.నిమిషాల సమయం కూడా మాట్లాడలేని దద్దమ్మ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటే సమాధానం చెప్పే ధైర్యం లేక పారిపోతున్నాడన్నారు. బిజెపికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి భయపడిపోయిన బిఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంలు ఒక్కటయ్యాయన్నారు. ప్రజలంతా కలిసి కమలంకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో నన్ను గెలిపించాలని తోకల శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

# ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటా.. అవకాశం కల్పించండి

**శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్**

**కలిసికట్టుగా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు**



కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న శేరిలింగంపల్లి అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 22 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి ప్రజలకు ఏళ్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. విద్యావంతుడినైన తనకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హాఫీజ్‌పేట్‌లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జగదీశ్వర్‌గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగద్గిరిగుట్టలోని మాధవనగర్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ సొంతమని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పి.జనార్థన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల హయాంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఎంతో అభివ ృద్ధి చేశారన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో తీసుకువచ్చిన డయల్ 100 ఎన్నో వేల మంది ప్రాణాలను కాపాడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పార్టీ ప్రకటించిన 6సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఉన్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, మూడు పర్యాయాలు కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవంతో అవినీతి లేని పాలనను అందిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాల్లో భాగంగా ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సొంత జాగా ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం 5లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ పార్టీ మహాలక్ష్మి పథకాన్ని ప్రకటించిందని, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ప్రతినెల 2500 రూపాయల నగదు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలను అమలు చేస్తామని అన్నారు.

# రాజేంద్రనగర్‌లో ఓట్లు అడిగే హక్కు నాకే ఉంది

**బిఆరెస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్.. బిఆర్ఎస్‌లో చేరిన బిజెపి కార్పోరేటర్**



బండ్లగూడలో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్న రాజేంద్రనగర్ బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, నవంబర్ 22 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గంను వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేశానని, ఇక్కడ ఓట్లు అడిగే హక్కు నాకే ఉందని ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అభ్యర్థి టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో చేసిన భారీ రోడ్‌షోకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. బిజెపి కార్పోరేటర్ భూపాల్‌గౌడ్ ఎట్టకేలకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గులాబీ కండువా కప్పి ఆయనను ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ గత 15.ఏళ్లుగా రాజేంద్రనగర్‌లో నేను చేసిన అభివృద్ధి, బిఆర్ఎస్ సర్కారు సమర్థవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పతకాలకు ఇతర పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బిఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కుగ్రామాల సమూహంగా ఉన్న రాజేంద్రనగర్‌ను హైటెక్‌సిటీకి ధీటుగా అభివృద్ధి చేశానని, ప్రణాళికబద్దంగా పని చేయడం వల్లనే ఇది సాధ్యపడిందన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇందుకు అందించిన తోడ్పాటు ఎనలేనిదన్నారు. దేశంలోనే ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న ఏకైక సర్కారు తెలంగాణ సర్కారు అని తెలిపారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీల పాలిత రాష్ట్రాలలో కరెంటు సవ్యంగా ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, మన తెలంగాణలో 24.గంటల నాణ్యమైన కరెంటును ఉచితంగా రైతులకు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ రాందాస్, అధ్యక్షులు సురేష్‌గౌడ్, కార్పోరేటర్లు చంద్రశేఖర్, పద్మా పాండు, సంతోషి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పద్మావతి పాపయ్య యాదవ్, మాలతీ నాగరాజు, శ్రీలతగౌడ్, లతా ప్రేమ్‌గౌడ్, నిఖిల సంగారెడ్డి పాల్గొన్నారు.

# వ్యక్తుల ఆధారంగా ఈ ఎన్నికల్లో మద్దతు

**జమాఅతె ఇస్లామీ హింద్**




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జమాఅతె ఇస్లామీ హింద్-అలయన్స్ ఫర్ డెమొక్రసీ ప్రతినిధులు

హైదరాబాద్,నవంబర్ 22,ప్రభాతవార్త: రాజకీయాల్లో ప్రమాణాలు ,విలువలు కోరుకునే జమాఅతే ఇస్లామీ హింద్ ఈఎన్నికల్లో పార్టీలకు కాకుండా వ్యక్తుల ఆధారంగా మద్దతు తెలుపుతుందని వైస్ ప్రెసిడెంట్ ఎ.ఎస్ సోహెబ్ తెలిపారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ విభాగం -అలయన్స్ ఫర్ డెమొక్రసీతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈఎన్నికల్లో ఎవరికి మద్దతివ్వాలనే దానిపై విస్తృతమైన సంప్రదింపులు జరిపామని జమాఅత్ స్థానిక యూనిట్లు, జమాఅత్ సభ్యుల కార్యకర్తల అభిప్రాయాన్నిదృష్టిలో ఉంచుకుని ఓనిర్ణయానికి వచ్చామన్నారు. ఈఎన్నికల్లో పార్టీ అధారంగా కాకుండా వ్యక్తుల ఆధారంగా సమాజ హితానికి పాటుపడేవారికి మద్దతివ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉదాహరణకు సిర్పూరునుంచి పోటీ చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కు మద్దతిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రజలందరూ తమ ఓటుహక్కును ఉపయోగించుకోవాలని, పోలింగ్ రోజున సాధ్యమైనంత త్వరలో పోలింగ్ స్టేషన్‌కు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఇంటర్నేషన్ ఐకాన్ అవార్డు



తన తోటి సిబ్బందితో కలసి ఆవార్డును చూపిస్తున్న ఎస్.ఎస్ రాజు

తార్నాక, నవంబర్ 22 ప్రభాతవార్త: తార్నాకకు చెందిన ప్రముఖ ప్రముఖ రియల్‌స్టేట్ సంస్థ రాజా ఇన్‌ఫ్రాడెవలపర్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎస్.రాజు ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఆయన బుధవారం తార్నాకలోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆవార్డు పొందిన వివరాలను సీఎండీ రాజు వెల్లడించారు. గత శతాబ్దకాలంగా వివిద సామాజిక సేవలతో పాటు రియల్‌స్టేట్ రంగంలో తమ సంస్థ అందిస్తున్న సేవలను గుర్తించిన దుబాయి ప్రభుత్వం రాజాఇన్‌ఫ్రా డెవలపర్స్ సేవలను గుర్తించి ఈ ఆవార్డును అందజేసినట్లు రాజు చెప్పారు. దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన సంస్థగా తమను ఒకటిగా గుర్తించడం సంతోషంగా ఉందని ఆవార్డు గ్రహిత సిఎండీ రాజు పేర్కొన్నారు. ఈ ఆవార్డు అందుకోవడం పట్ల భాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇంతకాలం ప్రోత్సహించి సహకరించిన వినియోగదా రులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. కష్టపడి పనిచేయడంతో పాటు నిజాయితీ,నిబద్ధతతో చేస్తే ఏదైనా సాధ్యమౌతుందని రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు.

# స్థానికంగా ఉన్న వాళ్లు తెలంగాణ బిడ్డలే..

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



ప్రచారంలో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, నవంబర్ 22, ప్రభాతవార్త :: కూకట్‌పల్లి నియోజకవర్గంలో అన్నదమ్ముల వలె ప్రశాంత జీవనం గడుపుతున్నామని స్థానికంగా ఉన్న వివిధ ప్రాంతాల వాళ్ళు తెలంగాణ బిడ్డలేనని ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. నియోజకవర్గం బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు మాజీ కార్పోరేటర్ తూము శ్రావన్ కుమార్‌తో కలిసి మూసాపేట్‌లో బుధవారం ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొన్నారు. మూసాపేట్ ఇందిరాగాంధీ విగ్రహం నుండి మొదలైన ర్యాలీ జనతా నగర్, యాదవ బస్తీ, గూడ్‌షెడ్ రోడ్, భరత్‌నగర్, అవంతి నగర్ తోట, బబ్బుగూడ ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఈ పదేళ్ళ కాలంలో హైదరాబాద్ మహానగరాన్ని శాంతిభద్రతలకు మారుపేరుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌దేనని అన్నారు. గత పాలనలో ఎక్కడ ఏ విధ్వంసకర చర్య జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నుంచి నేడు పటిష్ట శాంతిభద్రతలకు ఎక్కడా విఘాతం కలగకుండా కులాలు, మతాలు మధ్య విద్వేషాలు రేగకుండా అందరం సమానం అనే భావన హైదరాబాద్ మహానగరంలో ఏర్పరిచారని అన్నారు. ప్రజలకు కావలసిన మంచినీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలకు ఎక్కడ ఇబ్బంది లేకుండా నిరంతరం ప్రజాప్రతినిధులు అధికారులు అందుబాటులో ఉండి ఏ లోటు లేకుండా చూసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం శీలం పరితపించేవారు

బేగంపేట్, నవంబర్ 22 ప్రభాతవార్త : మాజీ కార్పొరేటర్, టీపీసీసీ కార్యదర్శి స్వర్గీయ శీలం ప్రభా కర్‌కు పలు వురు పలువరు నాయ కులు, ప్రజా ప్రతినిధు లు ఘ నంగా నివాళులు అర్పించారు. శీలం ప్రభాకర్ సంస్మరణ సభ బుధవారం ఎంజీ రోడ్డులోని మున్నూరుకాపు సంఘం హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి, సనత్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు మర్రి శశిధర్‌రెడ్డి, కోట నీలిమలతో పాటు అధికారులు, స్నేహితులు వచ్చి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకుడిగా ఆయన ప్రజలకు అందించిన సేవలను పలువురు కొనియాడారు. ఏ పదవి లేకున్నా నిత్యం ప్రజల్లో ఉండే వారి సమస్యల పరిష్కారం కోసం శీలం ప్రభాకర్ నిరంతరం పరితపించే వారని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం ప్రజలందరికి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నాయకులు శ్రీపతి సతీష్ కుమార్, ఎం. రాజు, పిల్లి శ్రీనివాస్‌రావు, చీర శ్రీకాంత్, సతీష్, చామకూర సుజాత, ఆదం సంతోష్, ఆదం విజయ్‌కుమార్, కరాటేరాజు, ఎంఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బిఆర్ఎస్‌కు వేసినట్లే..

**బిఆర్ఎస్ కాంగ్రెస్‌లకు బిజెపియే ప్రత్యామ్నాయం : బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్**



ప్రచారంలో పాల్గొన్న శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, నవంబర్ 22, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ 131 డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్, ఇంద్రసింగ్‌నగర్, వాణినగర్, మహేందర్ నగర్, కాకతీయ నగర్, అంబేద్కర్‌నగర్, చెరుకుపల్లి కాలనీలలో బుధవారం కుత్బుల్లాపూర్ బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తనని గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతుగా కుత్బుల్లాపూర్ డివిజన్‌లో బిజెపి ప్రచారానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, కాంగ్రెస్‌కి ఓటు వేస్తే ఎన్నికలు అయ్యాక కెసిఆర్ పార్టీలో చేరుతారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ పని ఖతమైందని, ప్రజలంతా బిజెపి వైపే ఉన్నారని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఆయన తన హామీలను వివరించారు. బస్తీలలో మౌలిక సౌకర్యాలతో పాటు, పేదలకు ఇండ్లు, రేషన్‌కార్డులు, పెన్షన్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారులందరినీ గౌరవించుకుంటామని వారికి ఇండ్లు పెన్షన్లు ఇప్పిస్తామన్నారు. కార్మికుల సంక్షేమం కొరకు ప్రత్యేక సంక్షేమ బోర్డును కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేస్తానని, జీడిమెట్ల ఈఎస్ఐ ఆసుపత్రిని ఆధునీకరించి, ఎర్రగడ్డ ఈఎస్ఐ ఆసుపత్రికి ధీటుగా అందిరికీ అందుబాటులోకి తెస్తానని అన్నారు. అన్ని కుల సంఘాలకు సంక్షేమ భవనాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్‌షో నిర్వహించిన కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి



ప్రచారంలో భాగంగా రోడ్‌షోలో పాల్గొన్న హన్మంత్‌రెడ్డి

జీడిమెట్ల, నవంబర్ 22, ప్రభాతవార్త : ఎన్నికల ప్రచారంలో భాగంగా 131 కుత్బుల్లాపూర్ డివిజన్‌లో బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కెపి విశాల్‌గౌడ్‌లు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతమున్న దుష్ట పరిపాలన ప్రభుత్వాన్ని తరిమికొట్టాలన్నారు. సుస్థిర పాలనను అందించాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. విశాల్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను గడపగడపకు ప్రాచరం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి హన్మంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం హన్మంత్‌రెడ్డి, విశాల్‌గౌడ్‌లు కల్పన సొసైటీ, బాపూనగర్, గనేష్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్, జాకీర్, జెస్సీపాల్, చింతల నాగరాజ్, రాధాకృష్ణ, సిద్దయ్య, బంటునరేస్, రాజు, వెంకటేశ్వరరావు, సుజాత, శోభరాణిలు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం**

**కొంపల్లి..** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి ఏఎంఆర్ గార్డెన్స్‌లో బుధవారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 28న రాష్ట్రానికి విచ్చేస్తున్న రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ రోడ్‌షో కార్యక్రమం ఏర్పాట్లు, రోడ్‌షోను జయప్రదం చేయడం తదితర అంశాలపై నియోజకవర్గ నాయకులు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నర్సారెడ్డి భూపతిరెడ్డి, జ్యోష్ణ శివారెడ్డి, బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, మైసిగారి శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, ప్రేమ్, శ్రవణ్‌కుమార్, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు సిఎం పదవి కాదు, చట్ట సభలలో రిజర్వేషన్‌లు కావాలి

సైఫాబాద్, నవంబరు 22 ప్రభాతవార్త: పదేళ్ళపాటు ఓబిసి సామాజిక వర్గానికి చెందిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బిసిలకు ఏమిచేయలేకపోయారని, తెలంగాణ రాష్ట్రానికి బిసి ముఖ్యమంత్రిగా వచ్చినా కూడా ఏమిచేయలేరని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ఆరోపించింది. బిసిలకు కావాల్సింది సిఎం పదవి కాదని, బిసిలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు, మహిళా బిల్లులో ఓబిసి మహిళలకు రిజర్వేషన్‌లు, ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ అని సంఘం డిమాండ్ చేసింది. బుధవారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, నాయకులు ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, బత్తుల సిద్దేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ నేత మంద కృష్ణమాదిగ మాటలకు బిసిలు కరిగిపోయి బిజెపికి ఓట్లు వేయరని, స్వయాన శ్రీకృష్ణభగవానుడు వచ్చి చెప్పినా వేయరని స్పష్టం చేశారు.

# కుత్బుల్లాపూర్ గడ్డపై గులాబీ జండా ఎగరాలి : ఎమ్మెల్యే కెపి వివేకానంద



తాండ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

జీడిమెట్ల, నవంబర్ 22, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ గడ్డపై గులాబీ జండా ఎగరాలని ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. బుధవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 27వ వార్డులోని దుండిగల్ తాండ 1, తాండ 2, వార్డు నెంబర్ 1, 28లలోని చర్చి గాగిల్లాపూర్ సర్వే. నెంబర్ 214, చైతన్య కాలనీ, ఓల్డ్ గాగిల్లాపూర్ 2,3,4,5 వార్డు, దుండిగల్, నాగులూర్‌లలో ఎమ్మెల్యే కెపి వివేకానంద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల బలోపేతం ద్వారా వేగంగా అభివృద్ధి సాధించవచ్చునని నమ్మి తాండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధులతో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి చేసిన ప్రజా నాయకుడు సీఎం కెసిఆర్ అని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నాడు చిన్న చిన్న గ్రామాలుగా ప్రజల సంక్షేమం కోసం పనిచేసే బిఆర్ఎస్ పార్టీని నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో భారీ మెజార్టీతో అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, వార్డు అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు హామీలకు, ప్రచారాలకు మోసపోవద్దు

**కర్నాటక రైతు సంఘం అధ్యక్షులు కె చంద్రశేఖర్**



ధర్నాలో అభివాదం చేస్తున్న కర్నాటక రైతు సంఘం మరియు గ్రీన్ ఆర్మీ నేతలు

ధర్నాచౌక్, నవంబర్ 22, ప్రభాతవార్త: ఎన్నికలలో నాయకులు ఇచ్చే తప్పుడు హామీలను, ప్రచారాలను నమ్మి మోసపోవద్దని కర్నాటక రైతు సంఘం అధ్యక్షులు కే.చంద్రశేఖర్ హితవుపలికారు. బుధవారం కర్నాటక రైతు సంఘం మరియు గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో రైతుల ఓటును కాపాడుకుంటామంటూ ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అమచేసిన వ్యవసాయ చట్టాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇవ్వటంతో కర్నాటక ఎన్నికలలో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి గెలిపించామని గుర్తు చేశారు. కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ వ్యవసాయ చట్టాన్ని మాత్రం రద్దు చేయకపోగా అవే చట్టాలను పూర్తి స్థాయిలో అమలుచేసేందుకు కృషి చేస్తున్నారని ఆరోపించారు. రైతులు భూములను పెద్ద ఎత్తున అమ్ముకుంటూ ప్రాణాలు సైతం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు వ్యవసాయ పంప్‌సెట్స్ కోసం ట్రాన్స్‌ఫారం, స్తంభం, వైరు వంటి పనిముట్లను ఇకపై ఇవ్వమని, మార్కెట్‌లోనే కొనుగోలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందని ఆరోపించారు. పాడి పరిశ్రమలో సైతం కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని, ఎన్నికలలో లీటరు పాలకు 7 ఇస్తామని చెప్పి బెంగుళూరు డెయిరీ ఒక్కసారిగా రెండు రూపాయలు పాలధర, రెండు రూపాయలు పశుగ్రాసం ధర ఎక్కువ చేసి పాడి రైతుల నుండి నాలుగు రూపాయలు దోచుకుంటోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చైరె గౌడ్, నాయకులు నారాయణస్వామి, ఆరాధ్య, ఉమ, బైరెగౌడ్ పాల్గొన్నారు.

## లష్కర్‌లో బిఆర్ఎస్‌ను గెలిపించాలి : లింగాని ప్రసన్న



తుకారాంగేట్‌లో పద్మారావును గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

అడ్డగుట్ట, నవంబర్ 22 ప్రభాతవార్త: సికింద్రాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌ను బారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బుధవారం తుకారాంగేట్, గోల్‌బావి, కొండా రెడ్డి నగర్, గడ్డమీది బస్తీ, ఎంసి.హెచ్.క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ ఆధ్వర యంలో బిఆర్ఎస్ యువనేత రామేశ్వర్ గౌడ్‌తో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు నక్క మధు, శ్రీనివాస్ గౌడ్,సత్తయ్య గౌడ్, పెండెంమనోహర్, మహ్మద్, పొన్నాల రాజు, వసంత, అమర్, వెంకటేశ్, మహేశ్వరీ, మోహన్, శివశంకర్, సంతోష్ పాల్గొన్నారు.

## ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపకాలను అరికట్టాలి

**గవర్నర్‌కు విజ్ఞప్తి చేసిన జర్నలిస్టుల బృందం**



గవర్నర్ తమిళిసైకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న ప్రతినిధి బృందం

సైఫాబాద్, నవంబరు 22 ప్రభాతవార్త:రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు డబ్బు, మద్యం పంపకాలతో ఓటర్లను ప్రలోభాలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక ప్రతినిధులు రాష్ట్ర గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను ఒక ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. గవర్నర్‌ను కలిసిన బృందంలో వేదిక సభ్యులు పాశం యాదగిరి, మామిడి సోమయ్య, అఖిల భారత జర్నలిస్టుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు అనంచిన్ని వెంకటేశ్వర్‌రావు, నామాల విశ్వేశ్వరరావు, హరినాథ్, రవికుమార్, సి.హెచ్.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, ఎన్నికల సందర్భంగా పాత్రికేయులపై జరుగుతున్న దాడులు, ఇతర నిఘా విషయాలపై వారు గవర్నర్ దృష్టికి తీసుకువెళ్ళారు.

## ముర్తుజగూడలో పెరిగిన బిఆర్ఎస్ బలం



మొయినాబాద్ మండలంలోని ముర్తుజగూడలో పలు పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్‌లో చేరిక

**మొయినాబాద్, నవంబర్ 22 ప్రభాతవార్త:** మొయినాబాద్ మండలంలోని ముర్తుజగూడలో పలు పార్టీల నుంచి నాయకులు కార్యకర్తలు బిఆర్ఎస్‌లో చేరడం వల్ల ఆ గ్రామంలో పార్టీకి బలం, మద్దతు పెరిగిందని చేవెళ్ల బిఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. స్థానిక నాయకుడు చప్పిడి పెంటరెడ్డి ఆధ్వర్యంలో వీరంతా కాలె యాదయ్య సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి యాదయ్య కండువా కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇంత పెద్ద ఎత్తున బిఆర్ఎస్‌లో చేరడం పట్ల యాదయ్య సంతోషం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్‌లో చేరిన వారిలో ముర్తుజాగూడ నాయకులు ఏ.విక్రమ్‌రెడ్డి, ఎస్.మల్లారెడ్డి, కె.గోపాల్, కె.గణేష్, ఎండి మోసిన్ ఖాన్, జి.కరుణాకర్, సిహెచ్ విజయ్, పి.ప్రశాంత్, ఇ.రాజేష్, ఆర్ వినోద్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, జడ్పిటిసి శ్రీకాంత్, సిహెచ్ పెంటయ్య, ఆర్.ఎర్రయ్య, జె.వెంకటేశ్, ఎండి మతీన్ ఖాన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మామకు మద్దతుగా కోడలు ప్రచారం



**ఆదిభట్ల నవంబరు22,ప్రభాతవార్త :** ఆదిభట్ల మున్సిపాలిటీలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి కోడల్ మల్ రెడ్డి స్నేహ రెడ్డి ఆదిభట్ల గ్రామంలో గడపగడపకు ప్రచారం చేశారు.ఇందులో భాగంగా మహిళలతో చర్చించి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మహిళల సమస్యల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిందని తెలిపారు.ఈ పథకం ద్వారా ప్రతి మహిళలకు ప్రతినెల వారి అకౌంట్లో 2వేల ఐదు వందల రూపాయలను జమ చేస్తుందన్నారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యం

**-మాల్ సర్పంచ్ పడకంటి కవిత శేఖర్ గౌడ్**



మాల్‌లో జోరుగా కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తున్న కవిత శేఖర్ గౌడ్

**యాచారం నవంబరు22,ప్రభాతవార్త :** కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని మాల్ సర్పంచ్ పడకంటి కవిత శేఖర్ గౌడ్ పిలుపునిచ్చారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా మాల్ మార్కెట్‌లో పాత మాల్‌లో జోరుగా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలంటూ ప్రచారం కార్యక్రమం చేపట్టారు.భారీగా ర్యాలీ నిర్వహించి గ్రామంలో పర్యటించారు.ఇంటింటా ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలపై విస్తృతంగా వివరించారు.గ్రామం మూడు జిల్లాల సరిహద్దుల్లో ఉండడం వలన ఓటర్ల సన్నద్ధం చేసేందుకు సర్పంచ్ వార్డు సభ్యులు కార్యకర్తలు అంతా స్వచ్ఛందంగా ఉదయం నుండి సాయంత్రం వరకు గడపగడప తిరుగుతూ ప్రచారం చేశారు. మాల్‌లో అధిక మెజార్టీ తెచ్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని దీమా వ్యక్తం చేశారు.

### లయన్స్ జంబుల రంగనాయకమ్మ విగ్రహావిష్కరణ



జంబుల రంగనాయకమ్మ విగ్రహావిష్కరణ చేస్తున్న దృశ్యం

**కడ్తాల్,నవంబరు 22 ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బాలాజీనగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి సంయుక్త ఆధ్వర్యంలో కడ్తాల్ పట్టణంలో జంబుల రంగనాయకమ్మ పార్కులో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి. బాబురావు, ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆర్. సునిల్‌కుమార్, మల్టిపుల్ ఛైర్‌పర్సన్ మోహన్‌రావు, ఎల్‌సిఎఫ్ ఛైర్మన్ ఎస్.నరెందర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఎల్సిఐఎఫ్ ఏరియా లీడర్ జి. చిన్న కిషన్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షులు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్‌తో కలిసి జంబుల రంగనాయకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అండర్ సిఎస్ఆర్ ఆక్టివిటీస్ ఆఫ్ జంబుల రంగనాయకమ్మ ఫ్యామిలీ మరియు ఆర్ఆర్ గ్రీన్ సిటివారి సంయుక్త నిధులతో నిర్మించిన పార్కులో రంగనాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జంబుల రంగనాయకమ్మ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫాస్ట్ జిల్లా గవర్నర్ జూలూరి రమేష్‌బాబు, ఎస్. రాధాకృష్ణ, కోటేశ్వర్‌రావు, ఆర్. మహేందర్‌రెడ్డి, ఆర్‌సి ప్రభాకర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేట్ వీరబొమ్మ బిక్షపతి, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి కొరివి వెంకటయ్య, క్లబ్ పిఆర్ఓ పాషా, కడ్తాల లయన్స్ క్లబ్ సభ్యులు కృష్ణమూర్తి, గంప శ్రీను, వెంకటేష్, రాజేందర్‌రెడ్డి, జూలూరి లింగయ్య, కె.రాంరెడ్డి, ఓంకారం మధుసూదన్‌రెడ్డి, అంజయ్య, జూలూరి రమేష్, పాండురెడ్డి, రంగనాయకమ్మ కుటుంబ సభ్యులు లయన్ సుధాచెన్న కిషన్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌కి కార్మిక నేత అశోక్‌గౌడ్ రాజీనామా

**ఘట్‌కేసర్, నవంబర్ 22, ప్రభాతవార్త:** బీఆర్ఎస్‌పార్టీ ఉమ్మడి ఘట్‌కేసర్ మండల కార్మిక విభాగం మాజీ అధ్యక్షులు పూటుకూరి అశోక్‌గౌడ్‌కు బీఆర్ఎస్‌పార్టీకి రాజీనామా చేశారు. ఈమేరకు ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన తన రాజీనామా పత్రాన్ని చూపించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, కేసీఆర్ కుటుంబ పాలన, విచ్చలవిడిగా దోపిడి, తెలంగాణ ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత లేకపోవడంతో పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ప్రాణాలను బలిదానం చేసి ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన వాళ్లను పార్టీ మోసం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సర్కారు నియంత, తప్పుడువిధానాలతో బీఆర్ఎస్ పార్టీలో కొనసాగలేక రాజీనామా చేసినట్లు అశోక్‌గౌడ్ తెలిపారు.

# సాఫీగా ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు

**-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలికేరి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోలికేరి.



వీడియో కాన్ఫరెన్స్ దృశ్యం.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, నవంబర్ 22(ప్రభాతవార్త) :** జిల్లాలో శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలికేరి అన్నారు. రాష్ట్ర శాసన సభ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్,ఇతర ఉన్నతాధికారులతో కలిసి బుధవారం న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం(ఈ.సీ.ఐ) సీనియర్ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పోలింగ్ నిర్వహణ కోసం చేపట్టిన చర్యల గురించి ఆయా జిల్లాల వారీగా కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ భారతిహోలికేరి మాట్లాడుతూ.. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేశామని, ఓటింగ్ వివరాలతో కూడిన స్లిప్పులను సైతం ఇప్పటికే జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో పంపిణీ చేశామని సీనియర్ డిప్యూటి ఎలక్షన్ కమిషనర్ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఎం బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, టెండర్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయ్యిందని తెలిపారు. కమిసనింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు వీలుగా ఈ.సీ.ఐ.ఎల్ ఇంజనీర్ల బృందాలు జిల్లాకు చేరుకున్నారని తెలిపారు. ఎనబై ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యంగులకు వారివారి ఇళ్ల వద్ద నుండే ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 20వ తేది నుండి ఈ బృందాలు ఓట్ ఫ్రమ్ హోమ్ ప్రక్రియ చేపట్టడం జరిగిందని వివరించారు. 21 వరకు 1792 మంది ఓటు హక్కు హోమ్ ఓటింగ్ ద్వారా వినియోగించుకున్నారని, పోలీస్ సిబ్బంది 1520 మంది ఓటు హక్కు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారని ఈ.సీ నిబంధనలకు అనుగుణంగా పూర్తి గోప్యత పాటిస్తూ ఓటు సేకరణ జరిపేలా గట్టి చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అన్నారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఇప్పటికే రెండు విడతలుగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కల్పించామన్నారు. శిక్షణ కేంద్రాల వద్దే పెసిలిటేషన్ సెంటర్‌లను నెలకొల్పి పోలింగ్ విధుల్లో నియమించబడిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.పోలీసులు సహా ఇతర ఎన్నికల విధుల్లో నియమించబడిన సిబ్బంది కోసం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. జిల్లాలో సి విజిల్ యాప్ ద్వారా 403 ఫిర్యాదులు అందాయని,మొత్తం ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. జిల్లా స్థాయిలోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని తెలిపారు.ప్రశాంత వాతవరణంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేయాలని ఈ సందర్భంగా ఈ.సీ.ఐ సీనియర్ డిప్యూటి ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ హితవు పలికారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, సీ.పీ.ఓ దిలీప్ కుమార్, ఎన్నికల విభాగం సిబ్బంది సైదులు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తి రోడ్డు పనులతో అవస్థలు







మీర్ఖాన్‌పేట గ్రామం వద్ద నత్తనడకన సాగుతున్న రోడ్డు నిర్మాణం వలన ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**కందుకూరు, నవంబర్ 22, ప్రభాతవార్త:** మీర్ఖాన్‌పేట గ్రామంనుండి యాచారం మండల కేంద్రాన్ని కలిపే ప్రధాన రోడ్డు నిర్మాణం సంవత్సరాలు గడుస్తున్నా పూర్తికావడం లేదు. దానివలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతుకుల రోడ్డు వలన వాహనదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాహనాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోవడం భారీ వాహనాల రాకపోకలు పెద్దసంఖ్యలో తిరుగుతుండగా రోడ్డంతా దుమ్ముదూలివలన ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ఈ రోడ్డు మార్గంలోని మీర్ఖాన్‌పేట వద్ద వాగుపైన బ్రిడ్జి నిర్మానం పనులు నత్తనడకన సాగుతున్నాయని వర్షాకాలంలో ఈ రోడ్డుపైన రాకపోకలు అగిపోయాయని వాగుపైన నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టిన సమయంలో ప్రయానీకుల సౌకర్యార్థం వాగువద్ద డైవర్షన్ దారి ఏర్పాటు చేశారు. అడైవర్షన్ దారి వర్షాల ప్రభావం వలప పలుమార్లు కొట్టుకుపోయిందని స్తానికులు వాపోయారు . ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మానం జరిగినా బ్రిడ్జిపైనుండి రాకపోకలు సాగించడానికి రోడ్డు నిర్మానం పనులు చేపట్టడం లేదని ఈ అవస్తలు ఎన్నాల్లని ప్రయానీకులు అయాగ్రామాల ప్రజలు అందోళన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా రోడ్డు నిర్మానం పనులు నత్తనడకన సాగుతుండగా ప్రజల కష్టాలను పట్టించుకునే నాదుడు కరువైనారని ఇప్పటికైనా రోడ్డు నిర్మానం పనులు వేగవంతం చేసి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నివారించాలని కోరుకుంటున్నారు. పాతరోడ్డు తక్కువ వెడల్పు ఉండేదని ఆ సమయంలో రోడ్డుకు ఇరువైపుల ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు ఉన్నాయని నిబందనల ప్రకారం రోడ్డు వెడల్పు చేయడం జరుగుతుందని ఈ సమయంలో రోడ్డు ఇరువైపుల ఉన్న విద్యుత్ లైన్లను షిఫ్ట్ చేయవలసి ఉన్నదని దానివలన రోడ్డు నిర్మాణంలో జాప్యం జరుగుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నారు. ఈ విషయంలో అధికారులు చొరవచూపి పనులు వెంటనే పూర్తిఅయ్యేలా చూడాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఊపందుకున్న కాంగ్రెస్ ఇంటింటికి ప్రచారం



ఘట్‌కేసర్‌లో ఇంటింటికి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**ఘట్‌కేసర్, నవంబర్ 22, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలో కాంగ్రెస్‌పార్టీ ఇంటింటికి ప్రచారం ముమ్మరంగా కొనసాగుతున్నది. మేడ్చల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌కు మద్దతుగా మున్సిపల్ నాయకులు పలు కాలనీల్లో బుధవారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం పత్రాలను చూపించి 6 గ్యారెంటీ పథకాలను వివరించారు. బూతుకమిటీల వారిగా నాయకులు ఆయా వార్డులో ఓటర్లను కలుసుకొని చేతి గుర్తుకు ఓటువేసి వజ్రేశ్‌యాదవ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు ఇంటికి వెళ్లి కరపత్రం అందజేసి కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సగ్గ అనిత, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మున్సిపల్ బీసీ సెల్ అధ్యక్షులు జియపల్లి బద్రి, నాయకులు కందకట్ల మాధవరెడ్డి, ఆర్ఫత్ పాల్గొన్నారు.

# కాలె యాదయ్యకు ఓటమి భయం పట్టుకుంది

**-టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

**షాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త :** చేవెళ్లలో ఓటమి భయంతోనే ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై దుష్ప్రచారానికి తెరలేపాడని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డిలతో కలిసి మాట్లాడుతూ.... మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భీం భరత్‌పై లేనిపోని ఆరోపణలతో కూడిన వాల్‌పోస్టర్లు, సోషల్ మీడియాలో పార్టీని, అభ్యర్థిని బదానాం చేయడానికి బీఆర్ఎస్ నాయకులు తెరలేపారన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్యపై కేసులు లేవా అని ప్రశ్నించారు. భీం భరత్ పేదల కోసం చేసిన పోరాటాల ఫలితమే ప్రభుత్వం ఈ కేసులు బనాయించిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులను గ్రామాల్లో ప్రజలు తిరగనివ్వకపోవడంతో సోషల్ మీడియా వేదికగా కేసుల తెరలేపాడన్నారు. నియోజకవర్గంలో భీం భరత్‌కు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు అంటింటిన వారిని పోలీసులకు అప్పగించిన ఉదాసీనంగా వ్యవహరించారన్నారు. ఈవిషయంలో ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.భీం భరత్‌కు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు అంటిస్తున్న ఏడుగురిని పోలీసులు ఎన్నికలు పూర్తయ్యే వరకు తమ కస్టడీల్లో ఉంచుకోవాలన్నారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులదేన్నారు. దమ్మున్న నాయకులు ప్రజాక్షేత్రంలో హుందాగా పోరాడాలే తప్పా, ఇలాంటి వ్యక్తిగత దూషణలు, కక్షలకు పోవద్దన్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీటీసీ ఆశోక్, సర్పంచ్ వెంకటేష్, టీపీసీసీ మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి ఆశ్వక్ అలీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్,బీసీసెల్ మండల అధ్యక్షులు గడ్డం చంద్రయ్య, నాయకులు తమ్మలి రవీందర్, రషీద్‌పటేల్, చేవెళ్ల స్వామి, పెంటారెడ్డి, చెన్నయ్య, నర్సింలు, చిన్నయ్య, ఆంజనేయులుగౌడ్, సుభాష్‌రెడ్డి, సత్యనారాయణ, యాదగిరి, బుచ్చయ్య, శ్రీను, కిషోర్‌నాయక్, కృష్ణ, రాములు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# బిఆర్ఎస్‌కు బిగ్ షాక్..కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న వలసలు

**-తూంకుంట మాజీ సర్పంచ్,7వ వార్డు కౌన్సిలర్ బిఆర్ఎస్‌కు రాజీనామా**



మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్రకాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన తూంకుంట మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, కౌన్సిలర్ ఎ.లక్ష్మినాగేశ్‌లు,పాల్గొన్న నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, నవంబరు 22, ప్రభాతవార్త** మేడ్చల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కు వరుసగ షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. పలువురు బిఆర్ఎస్ నాయకులు రోజు రోజుకు కొందరు బిఆర్ఎస్ నాయకులు పార్టీకి రాజీనామాలు చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. తూంకుంట మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, 7వ వార్డు కౌన్సిలర్ ఎ.లక్ష్మినాగేశ్‌యాదవ్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామాలు చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం ఉదయం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, 7వ వార్డు కౌన్సిలర్ ఎ.లక్ష్మినాగేశ్‌యాదవ్‌ల నివాసంకు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌లు చేరుకుని వారిని కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించటం జరిగిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డిల సమక్షంలో తూంకుంట మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, కౌన్సిలర్ ఎ.లక్ష్మినాగేశ్‌యాదవ్ వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌తో పాటు వారి కోరికల మేరకు వారు బిఆర్ఎస్‌కు రాజీనామాలు చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారని వారు అన్నారు. మేడ్చల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ గెలుపే లక్ష్యంగ కాంగ్రెస్ పార్టీలో తాము చేరామని అన్నారు. మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డిపై నియోజకవర్గ ప్రజలు విసుగు చెందుతున్నారని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించటానికి ఆసక్తి చూపుతున్నారని వారు అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారని, గడప,గడపకు వాటిని తీసుకవెళ్లాలని పార్టీ నాయకులకు వారు సూచించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు పనిచేయాలని నక్క ప్రభాకర్‌గౌడ్, ఎం.సుధీర్‌రెడ్డిలు కోరారు. తూంకుంట గ్రామ మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, తూంకుంట 4వ వార్డు కౌన్సిలర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి మధ్యలో ఉన్న విభేధాలను తొలగించి వారి ఇద్దరి మధ్య రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ ప్రత్యేక చొరవ చూపి వారి మధ్య సయోధ్య కుదిర్చి సఫలం కావటంతో వారు కాంగ్రెస్‌లో చేరటం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సమిష్టి కృషితో కాంగ్రెస్ పార్టీ విజయానికి అందరు కృషి చేయాలని నక్క ప్రభాకర్‌గౌడ్ కోరారు. దీనిలో కాంగ్రెస్ నాయకులు ఆర్.భరత్‌సింగ్, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎన్.విష్ణుగౌడ్, రాం చందర్‌యాదవ్, టిఆర్ రవీందర్‌గౌడ్, ఎద్దు శ్రీనివాస్‌యాదవ్,మల్లేశ్‌యాదవ్, పలువురు గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలి



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బీంభరత్

**షాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీం భరత్ అన్నారు. మంగళవారం రాత్రి షాబాద్ మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి చెందిన టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల డివిజన్ ఏ బ్లాక్ అధ్యక్షురాలు పీసరి అనితారెడ్డి ఎన్నికల ఖర్చు కోసం రూ.5లక్షలు ఎమ్మెల్యే అభ్యర్థి భీం భరత్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని, పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ సైనికులు గడపగడపకు తీసుకెళ్లి పార్టీ గెలుపుకు పాటుపడాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాల నుండి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటిలను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, నాయకులు పీసరి వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగం

**-24మంది వయోవృద్ధులు, దివ్యాంగులు,ఓటు వినియోగం**

**-పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ**



బాబగూడలో వయో వృద్ధుడు అనారోగ్యంతో ఉండి మంచంపై ఉన్నందున ఓటు కోసం ధరఖాస్తు చేసుకోవటంతో అధికారులు,సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను తీసుకరావటంతో ఓటును వినియోగించుకున్నట్లు చూపుతున్న దృశ్యం

**శామీర్‌పేట, నవంబరు 22, ప్రభాతవార్త** ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ అధికారులు, సిబ్బంది పర్యటించి ఓటు కోసం ధరఖాస్తులు చేసుకున్న వయోవృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ పేపర్ అందించటంతో తమ ఓటు హక్కును వారు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను సంబంధిత అధికారులు పకడ్బంధీగ ఇళ్లకు వద్దకు వచ్చి నిర్వహిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వృద్దాప్యం, అనారోగ్యంతో మంచానికి పట్టిన 24మంది పోస్టల్ ఓటును వినియోగించుకున్నారు. అయితే ఇళ్లవద్దనే ఓటు వేయటానికి అవకాశం ఇవ్వాలని ధరఖాస్తులు చేసుకోవటంతో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటను వినియోగించుకోవటానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చింది. బుధవారం దీనిలో భాగంగ శామీర్‌పేట మండలం బాబగూడ గ్రామానికి చెందిన సింగిరెడ్డి బాల్‌రెడ్డి వయో వృద్ధుడు అనారోగ్యంతో ఉండి మంచానికి పరిమితమైన పరిస్థితిలో ఉండి తన ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి వద్దనే వినియోగించుకున్నాడు. ఓటు కోసం ధరఖాస్తు చేసుకున్న వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు వారు తెలిపారు.దీనిలో ఎన్నికల అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడి టీచర్ తదితరులు పాల్గొన్నారు.


**Format C-1**
**DECLARATION ABOUT CRIMINAL CASES**

(As per the judgment dated 25th September, 2018, of Hon 'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India &Anr.)
Name and address of candidate: **KASIREDDY NARAYAN REDDY H.No. 3-21, Khanapur Villiage, Thalakondapalli Mandal, Ranga Reddy District – 509321,Telangana**
Name of Political Party: **INDIAN NATIONAL CONGRESS**
Name of Election: **LEGISLATIVE ASSEMBLY**
*Name of Constituency: **83 - KALWAKURTHY**
I **KASIREDDY NARAYAN REDDY**, a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

**(A) Pending Criminal Cases**

| Sl. No. | Name of Court | Case No. & Dated | Status of case(s) | Section(s)of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | XXIV Addl. Metropolitan Magistrate, Rachakonda | Filed a final report before the Hon'ble Metropolitan Session Court for Trails of SCs & STs Cases cum VII additional District & Sessions Judge Cyberabad. | Pending | 420 r/w. 34 IPC. Sec.3(1) (r) (s) SC ST POA Act, 2015. Allegation of cheating and abusing on the name of cast. However, the result given as false in final report vide No.66/C1/RK/2021, dated 28.05.2021. C.A.No.11779 of 2021 |

**(B) Details about cases of conviction for criminal offences**

| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description of offence(s) & punishment imposed | Maximum Punishment Imposed |
|---|---|---|---|
| | Not Applicable | Not Applicable | Not Applicable |

*In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency.

Sd/- **KASIREDDY NARAYAN REDDY**
(83) - KALWAKURTHY, (INC) Candidate.

## ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు



**చౌడాపూర్ నవంబరు22,ప్రభాతవార్త :**
పరిగి నియోజకవర్గ కేంద్ర ఎన్నికల పరిశీలకులు మహేందర్ బుధవారం చౌడపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు.నవంబరు30వ తేదిన జరిగే ఎన్నికల ప్రక్రియ , ఎన్నికల ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.పోలింగ్ బూత్ వివరాలను పరిశీలించి,ఎన్నికల సమయంలో చేపట్టవలసిన నియమాలను,జాగ్రత్తలను అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సెర్ప్ డిఆర్డిఏ అడిషనల్ పిడి నర్సింహులు ,ఆర్ ఐ లింగప్ప,జగన్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**-మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ కూతురు అనన్యచేతన్**



ఎన్నారం గ్రామంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ కూతురు అనన్యచేతన్

**కోట్‌పల్లి,నవంబరు 22, ప్రభాతవార్త;**
తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది ఇందిరమ్మ రాజ్యమేనని కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి పనులు జరుగుతాయని ఈ ఎన్నికలో మా నాన్నకు అశ్వీరదించి అసెంబ్లీ పంపాలని వికారాబాద్‌ను అన్ని రంగాలల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని వికారాబాద్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ కూతురు అనన్య చేతన్ అన్నారు.బుధవారం కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్నారం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి కాంగ్రెస్ పార్టీ తెచ్చిన గ్యారెంటీలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింగ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి పి, నర్సింహారెడ్డి, బీసీసెల్ అధ్యక్షులు శ్రీనివాస్,నాయకులు వెంకట్‌రాంరెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థీక సాయం అందిస్తున్న నాయకులు

**మర్పల్లి నవంబరు 22ప్రభాతవార్త :**
మర్పల్లి మండలంలోని పంచలింగాల్ గ్రామానికి చెందిన సోమారపు మొగులమ్మ 32 అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందగా ఈవిషయాన్ని తెలుసుకున్న యస్.కే ఆర్ ట్రస్టు ఛైర్మన్ జిల్లాగ్రంథాలయా మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, అంత్యక్రియలనిమిత్తం వారి కుటుంబానికి5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.అలాగే గణాపూర్ గ్రామానికి చెందినో జాని మొల్లయ్య (82) ఆదివారం మృతిచెందగా వారి కుటుంబానికి 5వేల రూపాయల ఆర్థికసహాయం చేయగా పట్లూర్ ఎంపిటిసి స్వప్నసురేశ్ 5 వేల రూపాయలు వారి కుటుంబబానికి అందజేశారు.పంచలింగాల్ ఉపసర్పంచ్ చంద్రశేఖర్, మొగులయ్య, మల్లేశ్,సంగయ్య,సాయులు,ఘనాపూర్,నాయకులు సురేశ్ కుమార్,ఎం సురేశ్ మృతులకుటుంబాన్ని పరామార్శించి ఆర్థిక షహాయాన్ని అందజేశారు.

## కాంగ్రెస్‌ను గెలిపించండి



**మర్పల్లి నవంబరు 22 ప్రభాతవార్త :**
వికారాబాద్ నియేజక వర్గంలో వచ్చే ఎన్నికలలో విజయం తద్యమని జిల్లా గ్రంథాలయా మాజీ చెర్మన్ కొండల్‌రెడ్డి, మార్కెట్‌మాజీ చైర్మన్ రామేశ్వర్,మాజీ యువజననాయకులు సురేశ్‌లు ఆన్నారు. ఈనెల 27 నుండి మండల కేంద్రంలోని కొంశట్‌పల్లి గ్రామం నుండి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తామని వారు తెలిపారు.కల్లిబొల్లి మాటలతో కాలం గడిపిన బిఆర్‌యస్ ప్రభూత్వానికి ప్రజలు సరైన గుణపాఠం చెప్పుతారనీ వారన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలను,2 లక్షల రుణమాఫి పథకాలను కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి వివరించాలనీ ప్రతి కార్యకర్త ఒక సైనికునిలా పనిచేసి ప్రసాద్‌కుమార్ విజయానికి కృషి కోరారు.

## కాంగ్రెస్ చేరిన వివిధ పార్టీల నాయకులు



**యాచారం నవంబరు22,ప్రభాతవార్త :**
కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని పలువురు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. బుధవారం యాచారం మండల పరిధిలోని నల్లెవెల్లి ఎంపిటిసి ఈదులకంటి లక్ష్మీపతి గౌడ్ ఆధ్వర్యంలో మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరారు. అదే విధంగా ధర్మాన గూడెం గ్రామానికి చెందిన పలురువు కూడా కాంగ్రెస్‌లో చేరారు.ఈ సందర్భంగా వారికి మల్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**కోట్‌పల్లి,నవంబరు 22, ప్రభాతవార్త;**
కోట్‌పల్లి మండల పరిధిలోని కోత్తపల్లి గ్రామంలో బుధవారం నాడు బియ్యం డిలర్ కాసాల భద్రప్ప ఆకస్మాత్తుగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచు గొడ్డలి మల్లయ్య వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి అంతక్రియాల కోసం రూ,3 వేలు అందజేశారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# పేదల బతుకుల్లో వెలుగు దీపం కాంగ్రెస్సే

**-కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్**



చేతి గుర్తుకు ఓటు వేయాలని మహిళా ఓటర్లను కోరుతున్న ప్రసాద్‌కుమార్

**వికారాబాద్,నవంబర్ 22, ప్రభాతవార్త:**
పేదల బతుకుల్లో వెలుగు దీపం కాంగ్రెస్ పార్టీయేనని, గరీభ్ హఠావో నినదించిన గొప్ప మహనీయురాలు మాజీ ప్రధానీ స్వర్గీయ ఇందిరా గాంధీ అని కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వికారాబాద్ మండలంలోని పెండ్లిమడుగు, పులిద్ది, అత్వెల్లి, మున్సిపల్ పరిధిలోని కొంపల్లి, కొత్తగడి, ఆలంపల్లి లో ఆయన న్నికల ప్రచారం నిర్వహించారు. ప్రసాద్‌కుమార్ రాకను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమా ులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రసాద్ కుమార్ కి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, గరీబ్ హఠావో నినాదంతో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, భూమి లేని వారికి అసైన్డ్ భూములు నాడు స్వర్గీయ ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ లు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. నిరుపేదలకు బతుకు దెరువు కోసం ఇచ్చిన భూములును నేడు బీఆర్ఎస్ ప్రభుత్వం లాక్కొని రోడ్డుమీదకు తీసుకువచ్చిందని విమర్శించారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు..బీఆర్ఎస్ నాయకులు కబ్జాలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం కబ్జాల పర్వం కొనసాగుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికి తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందిభి మోగించడం ఖాయమని, రేవంత్‌రెడ్డి హయంలో మళ్లీ ఇందిరమ్మ పాలన రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుర్లపల్లి రమేశ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీతి నిజాయితీతో రాజకీయాల్లో కొనసాతున్నాం

**-చేవెళ్ల బిఆర్ఎస్ అభ్యర్థి కాలెయాదయ్య వెల్లడి**



నవాబ్‌పేటన మండలంలోని వివిధ గ్రామాలల్లో నిర్వహించిన సభల్లో మాట్లాడుతున్న చేవెళ్ల బిఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్య

**చేవెళ్ళ, నవంబర్ 22, ప్రభాతవార్త**
నా రాజకీయ జీవితంలో నీతి నిజాయితీతో రాజకీయాలను చేశాను కాబట్టి ప్రజలు తమ కుటుంబాలను గెలిపించుకున్నారని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నందుకే రాజకీయాల్లో కొనసాగుతున్నామని చేవెళ్ల బిఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్య అన్నారు.బుదవారం నవాబ్‌పేట్ మండలం ఎల్లకొండ, మైతాబ్‌ఖాన్‌గూడ, మదిరెడ్డి పల్లి, గంగ్యాడ, నారేగూడ, పులపల్లి అక్నాపూర్, అత్తాపూర్ గ్రామాలల్లో ప్రజా ఆశీర్వాద యాత్రను నిర్వహించంచారు.జన సందోహంతో ర్యాలీగా వెళ్లి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. పెద్ద ఎత్తన ప్రజానీకం భారీగా తరలివచ్చి, డప్పు వాయిద్యాలతో కోలాటాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రేస్ బిజెపి అభ్యర్దులు ఊరసవెల్లిలా రంగులు మార్చుతారన్నారు.కాంగ్రేస్ బిజెపి అభ్యర్దులు నితిలేని రాజకీయాలు చేస్తూ ప్రజలకు అబద్దాలు చేప్పేందుకు ముందుకు వస్తున్నారన్నారు. బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులను చూసి ప్రజలు బ్రహ్మాపథం పలుకుతున్నారన్నారు.ఎన్ని శక్తులు అడ్డుపడుతున్న బిఆర్ఎస్ గెలుపును అడ్డుకోలేరన్నారు. బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులు ఏ ప్రభుత్వాలు చేయలేవన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఏవరి హయంలో జరగలేదన్నారు. పూటకో పార్టీ మార్చే నాయకులకు తగిన బుద్ధి చేప్పాలన్నారు. నిజాయితీగా ప్రజల కోసం పని చేసే నాయకులకు పార్టీలు మారే అవసరం ఉండదన్నారు.అభివృద్ధి చేసిన ప్రభుత్వాలకు ఓటు వేసి గెలిపిచాలని, బిఆర్ఎస్ గెలిస్తేనే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతాయన్నారు. ప్రతి ఒక్కరు కూడ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు.

# ఆశతో కాదు ఆశయంతో వస్తున్నా...

**-కాంగ్రెస్ రోడ్ షోలో అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్**

**కీసర,నవంబరు22,ప్రభాతవార్త:**
రాజకీయాల్లోకి ఆశతో కాదు... ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతో వస్తున్నా అని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్తి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుదవారం మండలంలోని అంకిరెడ్డిపల్లి,కీసర,వన్నిగూడ, బోగారం,కరీంగూడ, చీర్యాల,గోదుమకుంట, తిమ్మా యిపల్లి,యాద్గార్‌పల్లి, రాంపల్లిదాయర, కీసర దాయర గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి బోయిన్‌పల్లి నుండి ఇక్కడికి వచ్చి పెత్తనం చేయడం ఏమిటన్నారు.మంచినీరు ఇవ్వనోడు,బస్సు సౌకర్యం కల్పించని మంత్రి మల్లారెడ్డికి ఎందుకు ఓట్లు వేయాలని ప్రజలను అడిగారు.నా దగ్గర మేడ్చల్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం ఉందని,మంత్రి మల్లారెడ్డి దగ్గర డబ్బు తప్ప ఏముందన్నారు.నాకు పదవి ఉన్నా లేకున్నా ప్రజల మద్యలోనే ఉంటానన్నారు.నన్ను గెలిపించండి అభివృద్ధి అంటే ఎంటో చూపిస్తా అని అన్నారు. స్దానికంగా ఉన్న సమస్యలు అసెంబ్లీలో వినిపించాలంటే నా గళం ఎత్తాలి అంటే ప్రజాస్వామియం గెలవాలన్నారు.అది కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.ఈ నెల 30వ తేదీ జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కొంగు చాటి అడుగుతున్నా అని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి,జడ్పి వైస్ చైర్మన్ మలిపెద్ది సుధీర్‌రెడ్డి,కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్,మండల పార్టీ అధ్యక్షులు కోల క్రిష్ యాదవ్,యువజన,ఎన్ఎస్‌యుఐ,మహిళా కాంగ్రెస్,ఎస్‌సి సెల్,బిసి సెల్,మైనారిటీ సెల్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కీసరలో కాంగ్రెస్ రోడ్ షోలో మాట్లాడుతున్న మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్

## కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే రాష్ట్రం అంధకారం

**-జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి**



మాట్లాడుతున్న జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

**షాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త :**
కాంగ్రెస్ మోసపూరిత మాటలను నమ్మోదని, కాంగ్రెస్ ను నమ్మి ఓటేస్తే రాష్ట్రం అంధకారం అవుతుందని జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. బుధవారం జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డితో కలిసి మండల పరిధిలోని నాగర్‌గూడ, తాళ్లపల్లి, రుద్రారం, హైతాబాద్, మద్దూర్, నాగర్‌కుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....గత 60ఏళ్లలో జరగని అభివృద్ధి కేవలం ఎమ్మె ల్యే కాలె యాదయ్య తొమ్మిదిన్నర సంవత్సరాల్లో కనీవిని ఎరగని స్థాయిలో చేవెళ్ల నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాడన్నారు. రాష్ట్రం అభివృద్ధిలో మరింత పురోగతిని సాధించాలంటే బీఆర్ఎస్‌కు పట్టం కట్టా లన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ మరింత అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు నర్సింగ్ రావు, ప్రధానకార్యదర్శి శ్రీరాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మెన్ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచులు కృష్ణగౌడ్, పెంటయ్య, స్వర్ణ లతసతీష్, మల్లేష్, పార్టీ నాయకులు ఉన్నారు.

## ఆనంద్ గెలుపుతోనే వికారాబాద్ అభివృద్ధికి మలుపు

**- ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సతీమణి డాక్టర్ సబిత**

**కోట్‌పల్లి, నవంబరు 22,ప్రభాతవార్త;**
వికారాబాద్ నియోజక వర్గంలో అనంద్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యంమని వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు అనంద్ సతీమణీ డాక్టర్ సబిత అన్నారు. బుధవారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా అమె పర్యాటించి ఇంటింటికి వెళ్ళి బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.ఈసందర్భంగా అమె మాట్లాడుతూ... గత పాలనలో కాంగ్రెస్ పార్టీ పేదల కోసం చేసింది ఏమి లేదన్నారు. అదా మరిచి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మళ్ళి పాత రోజులు వస్తాయన్నారు. ఈ ఎన్నికల్లో మొదటగా ఉన్న గుర్తు కారు గుర్తుకు ఓటు వేసి అనంద్‌ను భారీ మోజా ర్టీతో గెలిపించాలని అమె పేర్కొన్నారు.



ఎన్కతల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహిస్తున్న వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సతీమణి డాక్టర్ సబిత

# ఓటు వేసిన వృద్ధులు



మేడ్చల్‌లో వృద్దుల ఇంటింటికి వెళ్లిన పోలింగ్ సిబ్బంది

**మేడ్చల్, నవంబర్ 22. ప్రభాతవార్త ః**
మేడ్చల్‌లో కొంతమంది బ్యాలెట్ ఓటు వేశారు. వివరాల ప్రకారం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు 80 సంవత్సరాల పై బడిన వృద్దులు, నడవలేని, కదలలేని వారి తమ ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకోవడానికి కల్పించిన వెసులుబాటు ఆధారంగా పలువురు వృద్దులు ధరఖాస్తు చేసుకున్నారు. బుధవారం మేడ్చల్‌లో ధరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి పోలింగ్ అధికారులు వెళ్లగా 16 మంది వృద్దులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిసింది. ఈ ప్రక్రియలో ఎన్నికల అధికారితో పాటు ముగ్గురు అసిస్టెంట్లు, పోలీసులతో కలిసి ఇంటింటికి వెళ్లి వృద్దులతో ఓటును ప్రణాళిక బద్దంగా వేయించారు.

## ఎన్నికల నిర్వహణ సాఫీగా జరిగే విధంగా విస్తృత ఏర్పాట్లు

**-జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గోన్న కలెక్టర్ సి. నారాయణరెడ్డి

**వికారాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త :**
వీసీ ద్వారా ఏర్పాట్లను సమీక్షించిన ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ జిల్లాలో శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి,నారాయణ రెడ్డి అన్నారు. రాష్ట్ర శాసన సభ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి బుధవారం న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం (ఈ.సీ.ఐ) సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌వ్యాస్ జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.పోలింగ్ నిర్వహణ కోసం చేపట్టిన చర్యల గురించి ఆయా జిల్లాల వారీగా కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ... కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేశామని, ఓటింగ్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులను సైతం ఇప్పటికే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో సగటున 82, శాతం పంపిణీ పూర్తి చేశామని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ దృష్టికి తెచ్చారు. పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఎం బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, టెండర్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయ్యిందని, 80, ఏళ్ళు పైబడిన వృద్దులు, 40, శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యంగులు 830, మంది హోమ్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని మరో రెండు రోజులలో ప్రత్యేక పోలింగ్ బృందాల ద్వారా మిగిలిన వారందరికీ హోమ్ ఓటింగ్ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు.ఈ.సీ దృష్టికి తెచ్చేందుకు వీలుగా అందుబాటులోకి తెచ్చిన సీ.విజిల్ యాప్ గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ఆ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాల్సిందిగా ప్రజలకు అవగాహన కల్పించామని అన్నారు. జిల్లా స్థాయిలోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు తదితర వాటి కోసం వచ్చే దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గడువులోపు అనుమతులు జారీ చేస్తున్నామని అన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం రిసీవింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను నెలకొల్పి పక్కాగా ఏర్పాట్లు చేశామని తెలిపారు.ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకుఅధికారులందరూ అంకితభావంతో పని చేయాలని ఈ సందర్భంగా ఈ.సీ.ఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ హితవు పలికారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఎంసిసి నోడల్ అధికారి కృష్ణన్, ఎక్స్పెండిచర్ నోడల్ అధికారి శంకరాచారి, జిల్లా ఆడిట్ అధికారి వీరభద్ర రావు, జిల్లా హార్టికల్చర్ అధికారి చక్రపాణి, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

